క్లుప్తంగా



నెల్లూరు అపోలోలో చికిత్స పొందుతున్న మార్టూరు సీఐ పి. అక్కేశ్వరరావును పరామర్శిస్తున్న ఆమంచి

రక్తదానం అంటే ప్రాణదానం



వల్లాపల్లిలో రక్తదాన శిబిరం

బల్లికురవ: ప్రాణాపాయంలో ఉన్నవారిని రక్తదానంతో ఆయుష్‌తో ప్రాణాలు నిలబెట్టవచ్చని మార్టూరు రోటరీక్లబ్ రొటేరియన్ చింతల సుబ్బారావు అన్నారు. గురువారం వల్లాపల్లిలో చింతల నారాయణ, వెంకాయమ్మల జ్ఞాపకార్థం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 20 మంది రక్తదానం చేశారు. రోటరీక్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అంచనాలు తయారు చేయాలి



బల్లికురవలో మాట్లాడుతున్న ఎంపీడీవో

బల్లికురవ: ఈ గ్రామ స్వరాజ్‌లో 2024–25 సంవత్సరానికి గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గుర్తించాలని ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య కోరారు. గురువారం స్థానిక పరిషత్ కార్యాలయంలో 21 గ్రామ పంచాయతీలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సెక్రటరీలు, సచివాలయ ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్‌లకు శిక్షణ సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా గుర్తించిన పనులను ఈ గ్రామ స్వరాజ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గుర్తించిన పనులకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని ఆ పనులే చేపట్టాల్సి ఉంటుందని ఎంపీడీవో వివరించారు. యాక్షన్ ప్లాన్‌లో గ్రామాల వారీగా ప్రాధాన్యత కలిగిన పనులను గుర్తించి అంచానాలు తయారు చేయాలని తెలిపారు. ఈవోఆర్డీ దాసరి సుమతి, కార్యాలయ ఏవో రాంబాబు, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ చింతల అంజలి పాల్గొని మాట్లాడారు.

వైభవంగా భావనారుషి స్వామి రథోత్సవం



పేరాలలో జరుగుతున్న భావనారుషిస్వామి వారి రథోత్సవం

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం రాత్రి స్వామి వారి కళ్యాణోత్సవం ఘనంగా జరుగగా గురువారం రాత్రి స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి పేరాలలో ఊరేగించారు. వీధుల్లో బొమ్మల అంగళ్ళను ఏర్పాటు చేశారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చినవారితో ఆ ప్రాంతమంతా కిక్కిరిపోయింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. అలానే ఆ ప్రాంతంలో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా దారి మళ్లించారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.



పుష్పయాగానికి సిద్ధం చేసిన పూలు

ఘనంగా పుష్పయాగం



సాయిబాబాకు నిర్వహించిన పుష్పయాగం

చీరాల అర్బన్: స్థానిక పాపరాజుతోటలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరం 33వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబాకు ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేశారు. మేళతాళాలతో భక్తులు పట్టణంలో నగరోత్సవం నిర్వహించారు. అనంతరం సాయినాథునికి వివిధ రకాల పూలతో పుష్పయాగాన్ని నిర్వహించారు. అలానే వివిధ రకాల పూలతో సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించారు. పలు రకాల ప్రసాదాలను స్వామికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిబాబాను దర్శించుకున్నారు.



సాయిబాబాకు నివేదించిన పలు రకాల నైవేద్యాలు

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి

చినగంజాం: విజయవాడలో అంబేడ్కర్ స్మృతి వనంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరించనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాపట్ల జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు మేడికొండ సునీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

☛ చంద్రబాబు నాయకత్వంలోని గత టీడీపీ ప్రభుత్వం దళిత గిరిజన బహుజనులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేక మోసం చేస్తే, గత ప్రభుత్వం ఇచ్చిన మాటను ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిజం చేస్తోందన్నారు. ప్రపంచంతో సింబల్ ఆఫ్ నాలెడ్జ్‌గా కీర్తి పొందుతూ, భారత దేశంలో అన్ని వర్గాల మహిళలకు, దళిత గిరిజన బహుజనులకు హక్కులు కల్పించి, సమాజంలో ఆత్మాభిమానంతో బతకడానికి అవకాశం కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. సమాజంలోని రుగ్మతలను రూపుమాపి, సమసమాజ నిర్మాణానికి పాటుపడి అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన ఆయన 125 అడుగుల కాంస్య విగ్రహ ఏర్పాటు అభినందనీయమన్నారు. నవ్యాంధ్ర ప్రదేశ్ నడిబొడ్డున విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో ఏర్పాటు చేసి ఆ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న గౌరవ ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ మహత్తర కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలలు నుంచి మహిళలు, దళిత, గిరిజన, బహుజన సంఘాలు, అంబేడ్కర్ వాదులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అద్దంకి రూరల్: విజయవాడ స్వరాజ్ మైదానంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం జరగనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాల మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీపై దళిత నాయకుల ఆగ్రహం

- అమరావతిలో అంబేడ్కర్ స్మృతి వనం నిర్మిస్తామని మోసం చేశారని విమర్శ
- మాట నిలబెట్టుకున్న ఏకైక సీఎం జగన్ మోహన్ రెడ్డి అని కితాబు



సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న నియోజకవర్గ దళిత నాయకులు

పర్చూరు (చినగంజాం): గత టీడీపీ ప్రభుత్వంపై స్థానిక దళిత నాయకులు తీవ్రంగా విరుచుకుపడ్డారు. అమరావతిలో స్మృతి వనం ఏర్పాటు చేస్తామని దళితులను మోసం చేశారని వారు విమర్శించారు. గురువారం స్థానిక బొమ్మల సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. దశాబ్దాలుగా అనేక మంది పాలకులు దళితులను మోసం చేస్తూనే ఉన్నారని, దళిత నాయకులు కూరాకుల ఇస్సాక్ ఆరోపించారు. 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఇచ్చిన మాటన నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అని ఆయన కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అంబేడ్కర్ దేశానికి దిక్సూచి అని దళిత నాయకులు నూతలపాటి బలరాం అన్నారు. అమరావతిలో భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని కొబ్బరికాయ కొట్టి మరీ టీడీపీ ప్రభుత్వం దళితులను మోసం చేసిందని విమర్శించారు. విజయవాడ నడిబొడ్డున అత్యంత భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి మాటల సీఎం కాదని, చేతల సీఎం అని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పదవుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఏకైక వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో దళితులపై తీవ్రంగా దాడులు జరిగాయని మరో దళిత నాయకులు జూపూడి రోశయ్య ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో దళితులు ప్రశాంతంగా ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. దళితుల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని చంద్రబాబు దళితులపై అసహనం వ్యక్తం చేశారని దళిత నాయకులు కట్టా రత్నరాజు ఆరోపించారు. అందుకే చంద్రబాబుని వ్యతిరేకించి, జగన్ మోహనరెడ్డిని సీఎంని చేశామని గుర్తుచేశారు. శుక్రవారం విజయవాడలో జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అందరూ తరలి రావాలని కోరారు. ఎడ్లపల్లి జయరాజ్, వై రమేష్., శానం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను సీఎం చేసేందుకు ఎదురు చూపులు



కొత్తపాలెంలో సమస్యలు తెలుసుకుంటున్న హనిమిరెడ్డి



ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న హనిమిరెడ్డి

బల్లికురవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందింటంతో రెండోసారి ముఖ్యమంత్రిగా చేయాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని వైఎస్సార్ సీపీ అద్దంకి సమన్వయ కర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని కొత్తపాలెం, చిన అంబడిపూడి గ్రామాల్లో పల్లెపల్లెకు హనిమిరెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తపాలెం, చిన అంబడిపూడి గ్రామాల్లో గ్రామ దేవతలైన పోలేరమ్మ, అంకమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజల తదుపరి ఇంటింటికీ తిరిగారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీనెరవేర్చడంతో ప్రజల హృదయాల్లో జగనన్న చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. గత నెల 12వ తేదీన తాను అద్దంకి బాధ్యతలు చేపట్టానని, ఆ రోజు నుంచి 5 మండలాల్లోని ప్రజలు తనను కుటుంబ సభ్యుడిగా ఆదరిస్తున్నారని ఇదే ఆదరణతో త్వరలో జరిగే ఎన్నికల్లో తనను ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. జగనన్న పాలనలో కుల, మతాలకు తావులేకుండా పథకాలు అందాయని, తాను అదే స్ఫూర్తితో అద్దంకి అభివృద్ధికి పాటుపడతానని ప్రకటించారు. రెండు గ్రామాల్లో ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. జగనన్న పాలనకు ఆకర్షితులై రోజురోజుకు గ్రామాల వారీగా వైఎస్సార్ సీపీలో చేరేందుకు ప్రజలు క్యూ కడుతున్నారని ఇదే స్ఫూర్తితో పార్టీ అధికారం చేపట్టటం ఖాయమని హనిమిరెడ్డి అన్నారు. కొత్తపాలెం గ్రామంలో అస్వస్థతలో ఉన్న ఏల్చూరి హరిబాబు, మాలెంపాటి హనుమంతరావును, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, బాపట్ల జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, బల్లికురవ, వల్లాపల్లి, కె.రాజుపాలెం, కేవీ పాలెం, సొసైటీల అధ్యక్షుడు గుర్రం రంగారావు, మంచాల శ్రీనివాసరెడ్డి, ఒంగోలు సుబ్బారావు, దర్శి రామకృష్ణయ్య, మండల ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఇప్పల అయ్యప్పరెడ్డి, స్థానిక నేతలు మాదాల శివన్నారాయణ, కట్టా సుధాకర్, చల్లగుండ్ల సుబ్బారావు, మాలెంపాటి ఆదిబాబు, ధూళిపాళ్ల విజయేంద్ర, ఏల్చూరు రవీంద్ర సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

పీసీపల్లి: మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన పూజల వెంకట నారాయణ కనిగిరి నుంచి మద్యాన్ని తెచ్చి అక్రమంగా విక్రయిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు గురువారం తనిఖీ చేశారు. నారాయణ అరెస్టు చేసి 8 బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు మోదు చేస్తున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 22 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో వాలి యో ఫ్రిక్షన్ మెటీరియల ఇండియా సంస్థ వారిచే నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 22 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు గురువారం తెలిపారు. ఈ ఏడాది ఆఖరి సంవత్సరం చదువుతున్న ఈసీఈ, ఈఈఈ మెకానికల్ బ్రాంచుల్లో డిప్లమా పూర్తికాబోతున్న 79 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు తెలిపారు. రాత పరీక్షలు నిర్వహించగా 35 మంది ఇంటర్వ్యూలకు ఎంపికైనట్లు తెలిపారు. వారిలో 22 మంది విద్యార్థులు ప్రొడక్షన్ ట్రైనీ ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ. 16 వేలు స్టైపండ్, ఉచిత భోజన రవాణా సౌకర్యాలను కలుగజేస్తారని ప్రాంగణల ఎంపిక అధికారి ఎన్. పూర్ణ చంద్రరావు తెలిపారు. పాలిటెక్నిక్ డిప్యూటీ డైరెక్టర్ కె. విజయభాస్కర్ రెడ్డి, వివిధ విభాగాధిపతులు అభినందించారు.

ఉల్లాసంగా ఆటల పోటీలు



వాలీబాల్ జట్టును అభినందిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

బల్లికురవ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో యువతి యువకులు ఉల్లాసంగా పాల్గొంటున్నారని ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య అన్నారు. గురువారం బల్లికురవ ఉన్నత పాఠశాలలో కొమ్మినేనివారిపాలెం-ల్లికురవ మధ్య క్రికెట్ పోరు నువ్వా నేనా అన్నట్లు జరిగింది. మండల స్థాయి పోటీల్లో విజేతలను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపుతామని ఎంపీడీవో చెప్పారు. ఈ పోటీలను ఈవోఆర్డీ సుమతి పర్యవేక్షించారు.



బల్లికురవలో క్రికెట్ పోరు

వాలీబాల్‌లో చెరుకూరు జట్టు విజయం

పర్చూరు (చినగంజాం): ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గురువారం చెరుకూరులో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీలో పర్చూరు జట్టుపై చెరుకూరు 2 సచివాలయం జట్టు విజయం సాధించింది. మండల స్థాయిలో చెరుకూరు సచివాలయం 2 కొత్తపాలెం జట్టు పర్చూరు సచివాలయం 3 జట్టుతో ఆడి విజయం సాధించి నియోజక వర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. చెరుకూరు జట్టును గ్రామ సర్పంచ్ పేరం సుబ్బారావు, కొత్తపాలెం సర్పంచ్ పాలపర్తి సంపూర్ణమ్మ, పంచాయతీ కార్యదర్శి కొసన సత్యనారాయణ అభినందనలు తెలిపారు. మండల విద్యాశాఖాధికారి వెంకట రామయ్య పాల్గొన్నారు.

కులగణన పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి కాశీవిశ్వనాథ్

వేటపాలెం: గ్రామాల్లో నేటి నుంచి చేపట్టనున్న కులగణను పారదర్శంగా నిర్వహించాలని గ్రామ ప్రత్యేక అధికారి ఐ. కాశీవిశ్వనాథ్ ఆదేశించారు. మండల పరిధిలోని అక్కాయిపాలెం, పాపాయిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కులగణనపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ నుంచి కులగణన ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఒక సచివాలయ ఉద్యోగితో పాటు, ఒక వలంటీర్ తప్పని సరిగా సర్వేలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి ఇచ్చిన యాప్‌లో పేర్లు నమోదు చేసి ఈకేవైసీ తప్పని సరిగా తీసు కోవాలన్నారు.

కాంగ్రెస్ జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడిగా ఆంజనేయులు

చీరాల రూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడిగా చీరాలకు చెందిన న్యాయవాది నన్నెబోయిన ఆంజనేయులును ఎంపిక చేసినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవరపల్లి రంగారావు ప్రకటించారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రంగారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడారు. పార్టీని బలోపేతం చేసేందుకు జిల్లాస్థాయిలో బుధవారం బాపట్లలో మాజీ ఎంపీ జేడీ శీలం, జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా స్థాయిలో పార్టీలోని అన్ని హోదాల్లో బాధ్యుల నియామకాలు జరిగినట్లు చెప్పారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా చీరాలకు చెందిన కర్రెద్దుల సురేష్, జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడిగా కేవీ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా జేవీఎస్ఆర్. కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మేరుగ రమేష్, జిల్లా కార్యదర్శులుగా కంకట అనిల్‌కుమార్, గుత్తి ధననుంజయ్, కాటూరి చంద్రశేఖర్, దొడ్డా బ్రహ్మానంద రెడ్డిలను ఎన్నుకున్నట్లు చెప్పారు. నూతనంగా ఎన్నికైన బాధ్యులను ఈ సందర్భంగా పూల దండలు, శాలువాలువేసి ఘనంగా సత్కరించారు. పార్టీ బలోపేతానికి అందరు సమష్టిగా కృషి చేయాలని కోరారు. పేర్లి బుజ్జిరాజు, పీటర్ రమేష్, యర్రాకుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆయా పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు-5 అంగన్‌వాడీ సెంటర్‌లో ఆయా పోస్టుకు ఖాళీ ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందని ఇంకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ తిరుమలశెట్టి ఝాన్సీ ఒక ప్రకటనలో తెలిపారు. 35 సంవత్సరాల్లోపు వయస్సు కలిగి 7వ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు ఈ పోస్టుకు అర్హులన్నారు. ఈ నెల 27వ తేదీ లోపు ఇంకొల్లు ఐసీడీఎస్ కార్యాలయంలో అర్జీలు అందించాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మత విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాదరావు

చీరాల: మతపరమైన విద్వేషాలు రెచ్చగొడుతూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని చీరాల డీఎస్పీ ప్రసాదరావు అన్నారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. చీరాల రూరల్ మండలం గవినివారిపాలెంలో ఈనెల 15న క్రైస్తవులు సువార్త ప్రకటనలు చేస్తూ కరపత్రాలు పంచుతున్నారన్నారు. ఆ సమయంలో క్రైస్తవులను, ఏసుక్రీస్తును అసభ్య పదజాలంతో క్రైస్తవుల మనోభావాలు దెబ్బతీసేలా గ్రామానికి చెందిన అయ్యప్ప, వెంకటరావు మాట్లాడారన్నారు. ఈ సంఘటనలో దళిత, క్రైస్తవ సంఘాల నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురినీ అరెస్ట్ చేశామన్నారు. కోర్టులో హాజరపరచగా 14 రోజులు రిమాండ్ విధించడంతో ఒంగోలు సబ్‌జైలుకు తరలించామని చెప్పారు. మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలానే నిందితులను అరెస్ట్ చేయాలంటూ పోలీస్ 30 యాక్ట్ నిబంధనలు ఉల్లఘించి ఈనెల 16న హైవే పై ధర్నా చేసి వాహనాలు నిలిపివేసిన వారిపై కేసు నమోదు చేశామన్నారు. సమావేశంలో రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, రూరల్ ఎస్సై జనార్దన్, సిబ్బంది ఉన్నారు.